# తులసివనంలో తుమ్మచెట్టు


**బ్యాంకు రద్దీగా వుంది. తమ ఎస్.బి ఖాతాల్లో నుండి డబ్బు తీసుకోవడానికి కస్టమర్లు రాసిచ్చిన విత్‌డ్రాయల్స్‌ను కంప్యూటర్లో సరిచూస్తున్నాను. లక్ష రూపాయల విత్‌డ్రాయల్ స్లిప్ ఒకటి రావడంతో పాస్‌బుక్ తీసి చూశాను. కంప్యూటర్లో అకౌంట్ చెక్ చేశాను. లక్షరూపాయలు పోనూ మూడులక్షలకు పైగా బ్యాలెన్స్ వుంది. కస్టమర్ పేరు పరిశీలించాను. మద్దూరి రంగస్వామి అనివుంది. బహుశా వాడే అయి వుంటాడనుకొని పేరు పిలిచాను. అటువైపు వెయిటింగ్ హాల్లో సోఫాలో కూర్చున్నాడేమో, పేరు వినగానే వాడు 'యేస్' అని స్టైల్‌గా అంటూ కౌంటర్ దగ్గరికొచ్చి నిల్చున్నాడు.**

శాంతినారాయణ

మనిషి బాగా దిట్టంగా తయారయినాడు. కళ్లకు రేబాన్ కూలింగ్ గ్లాసులు పెట్టుకొని టక్ చేసుకొని ట్రిమ్‌గా వున్నాడు.

వాడే! చూడగానే పోల్చుకుంటూ, 'రంగస్వామి నువ్వేనేమయ్యా?' అని నవ్వుతూ అడిగాను. వాడు నన్ను వెంటనే గుర్తించి 'వోరె వోరె వోరె' అనుకుంటూ లోనికొచ్చి, 'యెన్నాళ్లయిందిరా శంకర్ ఇక్కడికొచ్చి? ఎక్కడున్నావింత వరకూ?' అని స్నేహంగా అడిగాడు. వానికి కుర్చీ ఆఫర్ చేసి కాఫీ తెప్పించాను. దాదాపు పదేళ్ల కిందటనుకుంటాను, నేను గుల్బర్గానుండి పనిమీద హైదరాబాద్ వచ్చినప్పుడు అకస్మాత్తుగా వాడు కనిపించాడు. ఆ తర్వాత ఇప్పుడు. చాలా కాలమయ్యాక కలుసుకున్నందుకు ఇద్దరమూ మురిసిపోతూ పరిసరాలను మరిచిపోయాం. ఐదు నిమిషాలు పని పక్కన పెట్టి కాఫీ తాగుతూ వానితో మాటల్లోకి దిగాను.

నేను అనంతపురం వచ్చి వారంరోజులయిందని, ఈ పదేళ్ల కాలంలో రెండు రాష్ట్రాలు తిరిగి చివరికి అతికష్టమ్మీద పుట్టిన ప్రాంతానికి వచ్చానని, వచ్చినప్పటి నుండీ తీరికలేకపోవడంతో కలుసుకోలేకపోయానని వానికి సంజాయిషీ చెప్పుకున్నాను. వాడు ఎంతో ఆనందపడుతూ తనను గురించి చెప్పాడు.



రంగస్వామి యూనివర్సిటీలో ప్రొఫెసర్ అన్న సంగతి వినగానే నేను గర్వంతో పొంగిపోయాను. తన భార్య కూడా ఇక్కడే నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీలో అకౌంటెంటుగా పనిచేస్తున్నదని, ప్రస్తుతం శారదానగర్లో ఇల్లు కడుతున్నామని, ఇంటి పని ఫినిషింగ్ స్టేజిలో వుందని వాడు చెబుతూ వుంటే నేనే ఇల్లు కడుతున్నట్లు ఫీలయ్యాను.

రంగస్వామి తన పిల్లల చదువుల విషయాలు చెప్పి, మాకు ఇద్దరికీ గురువూ, తనకు మామా అయిన ఏసుదాస్‌గారిని గురించి చెప్పాడు. వాడు ముఖ్యంగా చెప్పవలసిన వాళ్ల గురించి చెప్పకపోవడంతో నేనే 'అమ్మా తమ్ముడూ చెల్లెలూ బాగున్నారేమిరా? ఇప్పుడు వాళ్లు ఎక్కడుంటున్నారు? తమ్మునికీ చెల్లెలికీ పెళ్లి చేశావా?' అని అడిగాను. నా ప్రశ్నలతో వాని ముఖంలో ఎందుకో రంగులు మారసాగాయి.

'ఆc... ఆc... బాగానే వున్నారు. ఇంటికి రారా, అన్నీ మాట్లాడుకుందాం' అంటూ అంతకంటే ఇంకేమీ చెప్పకుండా పైకిలేచి, లాకర్ వోపెన్ చేసుకోవాలన్నాడు. లాకర్ పుస్తకంలోరాసి వానితో సంతకం చేయించి స్ట్రాంగ్ రూములోకెళ్లి లాకర్ వోపన్‌చేసి అక్కడే నిల్చున్నాను. నాకు తెలియని రహస్యం వాని దగ్గర యేదీ వుండదన్న ఉద్దేశంతో అక్కడున్నానే గానీ నిజానికి లాకర్ వోపెన్ చేసిన బ్యాంకు అధికారిగా నేనక్కడ నిల్చోకూడదు. నేను అక్కడుండడం వల్ల వాడు ఇబ్బంది పడుతున్నట్లు నాకనిపించింది. ఏమనుకున్నాడో యేమో ఏమాత్రమూ సంకోచపడకుండా, 'సరేరా, నువ్వు నీ సీట్లో కూర్చో పద, వస్తాను' అని అన్నాడు. వాని పరిస్థితినే కాదు, లాకర్లో దండిగానే పెట్టినట్లు కూడా అర్థం చేసుకొని నా సీట్లో కొచ్చి కూర్చున్నాను.

పది నిమిషాలయిన తర్వాత రంగస్వామి స్ట్రాంగ్ రూంలోనుంచి బయటికొచ్చాడు. నేను క్యాష్ కౌంటర్లో నుంచి లక్ష రూపాయలు తెప్పించి వాని చేతికిచ్చాను. వాడు థ్యాంక్స్ చెబుతూ వచ్చే ఆదివారం గృహప్రవేశముంటుందని తప్పక ఫ్యామిలీతో రావాలని మళ్లీ వచ్చి కలుస్తానని చెప్పి వెళ్లిపోయాడు. కస్టమర్స్ రద్దీ యెక్కువ కావడంతో నేను వాడి గురించి ఆలోచించే సమయం లేక నా పనిలో నిమగ్నమయిపోయాను.

సాయంకాలం బ్యాంకు నుంచీ ఇంటికి వెళుతున్నాను. దారిలో నాగరాజు కనిపించాడు. నాకూ రంగస్వామికీ మిత్రుడయిన నాగరాజు దాదాపు ఆరేండ్ల తర్వాత కనిపించడంతో సంతోషమైంది. ఇద్దరమూ హోటలుకెళ్లి కాఫీ తాగుతూ ఎన్నో విషయాలు మాట్లాడుకున్నాం. మాటల మధ్యలో గుర్తుకొచ్చి రంగస్వామిని గురించి ప్రస్తావించి, "వాని భార్య మీ ఆఫీసులోనే పని చేస్తూ వుందటకదరా!" అని అన్నాను.

'మా ఆఫీసులో అయితే వుందిగానీ పనిమాత్రం చేయడంలేదురా. చాలా గ్రేట్ పర్సనాలిటీ. ఇక మన స్నేహితుడంటున్నావే, ఆయన చాలా గొప్పవాడప్పా. ఈ శుభసమయంలో వాళ్లను గురించి ఎందుకులే' అంటూ మౌనం వహించాడు నాగరాజు.

'ఎందుకురా అట్ల మాట్లాడుతున్నావు? ఏమిటి సంగతి?' ఆసక్తిగా అడిగాన్నేను. ఒక్కొక్కరికి వొక్కో కారూ బంగ్లాలవంటి నాలుగిళ్లూ బ్యాంకుల్లో లక్షలకొద్దీ డిపాజిట్లూ లాకర్లూ... అబ్బో, చాలా పెద్దవాళ్లురా వాళ్లు. వాళ్లను గురించి ఎంత తక్కువ మాట్లాడుకుంటే అంత మేలు' అంటూ నాగరాజు అదోలాగ చూశాడు నావైపు. వాని మాటల్లోని అంతరార్థమేమిటో నాకు బోధపడలేదు. పైగా ఈర్ష్యతో నిండిన వాని మాటలు నాకు చిరాకు కలిగించాయి. 'స్నేహితుడు కారు కొనుకున్నందుకూ బాగా సంపాదించుకున్నందుకూ సంతోషపడాలిగానీ నువ్వేమిటిరా, ఈర్ష్యపడుతున్నావు? అయితే నువ్వేమీ మారలేదన్నమాట' చిన్నతనం నుండీ వానిలో కనిపించిన వోర్వలేని తనాన్ని ఎత్తి పొడిచాను.

'నేనెప్పుడూ ఇతరుల్ని చూసి అసూయపడతాననేగదరా నీ అభిప్రాయం. సరే. నేనెవర్ని చూసి, ఎందుకు ఈర్ష్య పడతానో నెమ్మదిగా నీకే తెలుస్తుంది లేప్పా. అవన్నీ ఇప్పుడెందుకు గానీ, ఫ్యామిలీతో సినిమాకు పోవాలి. వస్తాను మరి...' అంటూ పైకిలేచాడు నాగరాజు. ఇద్దరమూ బయటికొచ్చి స్కూటరెక్కాం.

నేను బజార్లో పని చూసుకొని ఏడు గంటలకల్లా ఇల్లు చేరుకున్నాను. బాగా ఉక్కగా ఉండడంతో స్నానంచేసి ఈజీ ఛైర్ తీసుకొని మిద్దెమీదకెళ్లి కూర్చున్నాను. కాసేపయ్యాక సుజాత కాఫీ తెచ్చి యిచ్చి పక్కన కూర్చుంది. కాఫీ చప్పరిస్తూ నాకు, నా స్నేహితులు కనిపించిన విషయమూ తనకు తన స్నేహితులు కనిపించిన విషయమూ చెప్పుకుంటూ కాసేపు మాట్లాడుకున్నాం. చెప్పవలసిన కబుర్లన్నీ అయిపోయాయేమో వంట పనుందని తాను కిందికెళ్లిపోయింది.

ఈజీఛేర్లో వెనక్కివాలి ఆకాశంలోకి చూస్తున్నాను. మిత్రులిద్దరూ మనసులో మెదిలారు.

ప్రొఫెసర్ రంగస్వామి, ఎంత స్థాయికి ఎదిగాడు వీడు! కాలం కలిసొస్తే రేపు వైస్‌ఛాన్సలర్ అయినా ఆశ్చర్యంలేదేమో! ఈ జీవితాల ప్రస్థానం ఎక్కడ మొదలై ఎక్కడికి చేరుకుంది!

** ** **

బత్తలపల్లి హైస్కూల్లో నేను చదువుకుంటున్న రోజులవి. చెర్లోపల్లి నుంచీ నాగరాజూ, సంజీవపురం నుంచీ నేనూ, రంగస్వామీ రోజూ నడుచుకుంటూ స్కూలుకెళ్లేవాళ్లం. మా వూళ్లో మాదిగ జనానికి తప్ప మిగతా కులాలవాళ్లకు కొద్దోగొప్పో భూములుండేవి. వ్యవసాయం లాభదాయకం కాకపోయినా బతకడానికి ఫరవా లేదనిపించేది. మధ్యతరగతి రైతు కుటుంబం కావడం వల్ల కొన్ని కష్టాలు పడినా మా తిండి మేము తినేవాళ్లం. ఏ జీవనాధారమూ లేకపోవడం వల్ల రంగస్వామి వాళ్ల కుటుంబం గడవడం కష్టంగా వుండేది.

రంగస్వామి తండ్రి కొండన్న ఆరోగ్యం సరిగా లేక కూలిపనికి వెళ్లడానికి చేతగాక ఇంటి దగ్గరే వుండి,

చర్మాలు తెచ్చుకొని 'కురుం' చెప్పులు కుట్టేవాడు. అతని భార్య రంగమ్మ పొలం పనులకు వెళ్లేది. ఆ రోజుల్లో కొండన్న చెప్పులకు మా పల్లెల్లో గిరాకీ వుండేది.

బత్తలపల్లి కొంచెం బేడు కొంపయినా అనంతపురం నుండీ చిత్తూరుకూ ధర్మవరం నుండి తాడిపత్రికీ వెళ్లే రోడ్డు కూడలిలో వుండడంవల్ల బస్సులు దిగి, ఎక్కే వాళ్లతో సందడిగా వుండేది. చిన్నచిన్న హోటళ్లూ చిల్లర అంగళ్లూ టీ బంకులూ సెలూన్ షాపులూ రద్దీగా వుండేవి. మేము ఎనిమిదో తరగతి చదువుతున్న రోజుల్లోనే కొండన్న పల్లెల్లో చెప్పుల వ్యాపారం మానేసి బత్తలపల్లి క్రాసింగ్‌లో హైస్కూలు కాంపౌండు పక్కన ప్రారంభించాడు. తర్వాత కొన్నాళ్లకే అతని చెప్పులకు గిరాకీ పెరిగి నాలుగు దుడ్లు చేతుల్లో ఆడేవి. చేతుల్లో నాలుగు పైసలు ఎక్కువ మెదిలినప్పుడల్లా ఆనందంతో స్కూల్లోకి వచ్చి కొడుకు చేతిలో ప్రేమగా కొంత చిల్లరపెట్టి ఏదయినా కొనుక్కొని తినమని చెప్పి, వాడు తింటూవుంటే మురిసిపోయేవాడు. కొడుకు భవిష్యత్తు గురించి ఎన్ని తీయని కలలు కనేవాడోయేమో, ఎంతో శ్రద్ధగా వినయంగా టీచర్ల దగ్గరకెళ్లి తన కొడుకు చదువు గురించి తెలుసుకునేవాడు. వాళ్లు రంగస్వామిని గురించి పొగుడుతూ వుంటే విని పరవశించిపోయేవాడు. ఆ పారవశ్యంతోనే బయటికెళ్లి పీకలదాకా సారాయి తాగి బజార్లో పడిపోయేవాడు. స్కూలు వదలగానే మాకు ఆ విషయం తెలిసి రంగస్వామీ నేనూ నీళ్లు తెచ్చి అతని మీద పోసేవాళ్లం ఆ రోజంతా రంగస్వామి బాధపడేవాడు.

మా క్లాసులో అందరికంటే రంగస్వామికే ఎక్కువ మార్కులొచ్చేవి. అందువల్ల టీచర్లకూ పిల్లలకూ వాడంటే ఎంతో ఇష్టం. అందరితోనూ కలిసిమెలసి సంతోషంగా గడుపుతూనే అప్పుడప్పుడు వాడు నాదగ్గర తన తండ్రి మితిమీరిన తాగుడునూ తమ ఇంటి పరిస్థితిని చెప్పుకొని కన్నీళ్లు కార్చేవాడు. తన పస్తుల బతుకునూ తనకోసం తన తల్లి పడుతున్న కష్టాన్నీ తలుచుకొని బాధపడేవాడు. తన కన్నతల్లి కళ్లల్లో సంతోషపు తృప్తిని చూడాలని ఆశపడేవాడు. అందుకోసమే తాను ఎలాగయినా చదువుకొని ఉద్యోగం సంపాదించాలని కలలు కనేవాడు. అటువంటి సమయంలోనే ఒకరోజు కొండన్న తాగిన మైకంలో మా స్కూలు పక్కనే లారీ కిందపడి చనిపోయాడు.


కొండన్న చావు రంగస్వామిని దిక్కులేనివాన్ని చేసింది. రంగమ్మను కొన్నాళ్లు పిచ్చిదాన్ని చేసింది. అంతటితో రంగస్వామి చదువు ఆగిపోతుందని మేమంతా అనుకున్నాం. అయితే మా స్కూలు పిల్లలూ, టీచర్లూ కొంత సహాయం చేయడంతో కొడుకు చదువు మధ్యలో ఆగిపోగూడదనుకొని రంగమ్మ వాన్ని ఆ సంవత్సరం చదివించడానికే పూనుకుంది. బత్తలపల్లి శెనక్కాయ మిషన్లో పని చేస్తూ మిగతా ఇద్దరు పిల్లల్ని పోషించుకుంటూ ఆరునెలలు కాలం గడిపింది. రంగస్వామి పట్టుదలతో చదివి పరీక్షలు రాసి పదోతరగతిలో మా స్కూలు ఫస్టు వచ్చాడు. మా హెడ్మాష్టర్ రామప్ప ఆశ్చర్యంతో ఉబ్బి తబ్బిబ్బయ్యాడు.

శెలవులు గడిచిపోయాయి. రామప్పగారు పట్టుబట్టి రంగమ్మను ఒప్పించి రంగస్వామిని అనంతపురం జూనియర్ కాలేజీలో చేర్చారు. హాస్టల్లో సీటు ఇప్పించారు.

చేతికి ఎదిగిన కొడుకు తన కష్టంలో పాలుపంచుకుని కుటుంబాన్ని ఆదుకుంటాడనుకున్న రంగమ్మ, తన బాధను ఎవరితో చెప్పుకోవాలో దిక్కు తెలియక వెతచెందింది. కొడుకు చదువులో ముందుకు పోతున్నందుకు సంతోషించాలో బాధపడాలో అయోమయంలో పడిపోయింది. ఏనాటి అనుబంధమో యేమో కానీ మా హెడ్మాష్టర్ రామప్పగారు చొరవ తీసుకొని రంగమ్మనూ ఆమె మిగతా పిల్లల్నీ అనంతపురం చేర్చాడు. ఆయనకు తోడుగా మా నాయన కూడా ఒక చేయి వేశాడు.

అప్పుడు కలెక్టర్ ఆఫీసుకు ఎదురుగా చెరువు గట్టు పక్కన రెండుమూడు కొట్టాలు మాత్రమే ఉండేవి. వాటి పక్కనే రంగమ్మ కొట్టం తయారయింది. రామప్పగారి ఇంటి దగ్గరే ఆమె నాలుగిళ్లల్లో పాచిపనులు చేయడానికి కుదిరింది. అయితే వారం దినాలకే కులం కారణంగా ఆమె పని మానేయవలసి వచ్చింది. తర్వాత పక్కనున్న కొట్టాల వాళ్లతో కలిసి ఇళ్లకు సున్నం పూసే పనికి

మా క్లాసులో అందరికంటే రంగస్వామికే ఎక్కువ మార్కులొచ్చేవి. అందువల్ల టీచర్లకూ పిల్లలకూ వాడంటే ఎంతో ఇష్టం. అందరితోనూ కలిసిమెలసి సంతోషంగా గడుపుతూనే అప్పుడప్పుడు వాడు నాదగ్గర తన తండ్రి మితిమీరిన తాగుడునూ తమ ఇంటి పరిస్థితిని చెప్పుకొని కన్నీళ్లు కార్చేవాడు. తన పస్తుల బతుకునూ తనకోసం తన తల్లి పడుతున్న కష్టాన్నీ తలుచుకొని బాధపడేవాడు.



పూనుకుంది. కులం కారణంగానే ఆ పని నుండి కూడా దూరమయింది. చివరికి డొబ్బుడుబండిలో కూరగాయలు అమ్ముతూ సంసారాన్ని చూసుకుంది.

నాగరికతకు నిలయమనుకుంటున్న నగరాలు కూడా అంటరానితనంలోని అంటును ఎలా అంటకుండా జాగ్రత్తపడుతున్నాయో తెలుసుకొని రంగస్వామితోపాటు నేనూ బాధపడేవాన్ని. పంటలు పండిస్తున్న చేతుల్లో, ధాన్యం మోసుకొస్తున్న చేతుల్లో, రకరకాల వస్తువులమ్ముతున్న చేతుల్లో కనిపించని అంటరానితనం అంట్లు తోమే చేతుల్లో ఎందుకు కనిపించేదో అర్థం కాక మేము నవ్వుకునేవాళ్లం.

రంగస్వామి ఎన్నో ఇబ్బందులుపడుతూ అవమానాలు భరిస్తూ మాతోపాటు బి.ఏ పాసై ఎం.ఏలో చేరాడు. చేరాడేకానీ వాని కుటుంబ పరిస్థితి అధ్వాన్నంగా మారిపోయింది. చిన్నతనం నుంచీ కూటికీ గుడ్డకూ నలుగుతూ చెమటలారని బతుకులో అలిసిపోయిన రంగమ్మ, కొడుకు చేయూతకోసం వేయికళ్లతో ఎదురు చూసింది. ఇంకొక రెండేళ్లకాలం కళ్లుమూసుకుంటే తన చదువు పూర్తవుతుందని ఆ తర్వాత తనకు తప్పక ఉద్యోగం దొరుకుతుందని చెప్పి తల్లిని కలల ఉయ్యాల మీద వూపి ఒప్పించి రంగస్వామి ఎం.ఏ.లో చేరాడు.

ఆశామార్గంలో రంగమ్మ మరింత చెమటోడుస్తూ నడవసాగింది. కొట్టం గోడలు కొంచెం పైకి లేపి ఈతాకు 'కప్పు'ను తీసివేసి పెంకులు వేయించింది. ఇంట్లో నేల మీద నల్లబండలు పరిపించింది. ఇదంతా కొడుకుకోసం చేయించింది. ఎవరయినా తన స్నేహితులు ఇంటికొచ్చినప్పుడు ఈతకొట్టాన్ని చూసి ఏమనుకుంటారోనని రంగస్వామి రెండు మూడుసార్లు గొనిగిన ఫలితంగా పెంకుటిల్లు తయారయింది. అయిందే కానీ ఆ తల్లి గుండెమీద పదివేల రూపాయల అప్పు భారం నల్లగుండు మాదిరి పడింది.

రంగమ్మ ఎంత కష్టపడినా ఇంటి ఖర్చులకూ కొడుకు కాలేజీ ఖర్చులకూ సరిపోయేది కాదు. ఇంక అప్పు ఎలా తీరుతుంది? అందుకే చిన్న కొడుకునూ కూతుర్నీ స్కూలు మానిపించి బేల్దారి పనికి వేసింది. ఆరోజు నుంచీ ఆ ఇంటి చెమటంతా రంగస్వామి చదువులో శరీరంలో తెలివితేటల్లో దాక్కోసాగింది.

ఆరోజు ఆదివారం. మరుసటి రోజు రంగస్వామి మాతోపాటు యూనివర్సిటీకి రావాలి. అప్పటికి రెండు జతల బట్టలు తప్ప మూడో బట్ట వానికి లేదు. ఇంట్లో ఏ పూటకాపూట జరగటమే కష్టమయిపోయింది. ఆ కన్నతల్లి, తన కొడుకు పెద్దపెద్ద చదువులకోసం చాలా పెద్ద కాలేజీకి పోతున్నాడన్న సంతోషంతో వాని భవిష్యత్తు మీద గంపెడాశను కళ్లల్లో నింపుకొని వాని కోరికను కాదనలేక ఎన్ని అవస్థలు పడి తెచ్చిందో పాపం, ఒక యాభై రూపాయలు వాని చేతిలో పెట్టింది. అది తీసుకుని నా దగ్గరికి ఆనందంగా వచ్చాడు. ఇద్దరమూ డిగ్రీ కాలేజీ ముందున్న ఫుట్‌పాత్ మీద పాతబట్టలు అమ్మేవాని దగ్గరి కెళ్లాం.

రంగస్వామి తనకు నచ్చిన రెండు ప్యాంట్లూ రెండు శ్లాగులూ చేతికి తీసుకొని చూడసాగాడు. ఎవరు కట్టి వొదిలేసినవో! ఎవరి మురికిని అంటుకొని ఏ స్థితిలో అక్కడికి చేరుకున్నాయో! పేదరికం అదంతా ఆలోచన చేయదేమో! ఆ బట్టల్ని ఎంతోమంది కొంటున్నందువల్లనేకదా, అక్కడ వాళ్లు అమ్ముతున్నది!

అప్పుడు ఆ బట్టలు నాకూ బాగానే నచ్చాయి. రంగస్వామి రెండు జతల బట్టలు సెలెక్ట్ చేసుకున్నాడు. చాలాసేపు బేరమాడిన తర్వాత బట్టలవాడు చివరికి అరవైకి అయితే ఇస్తానన్నాడు. నేను పది రూపాయలు సర్ది ఇచ్చాను. వాడు బట్టలు తీసుకున్నాడు.

ఎన్నో చేదు అనుభవాలతో మా చదువు ముగిసింది. మేము ఎం.ఏ చదువుతున్న రోజుల్లోనే మా ఎకనామిక్స్ ప్రొఫెసర్ ఏసుదాసుగారి దృష్టి రంగస్వామి మీద పడింది. అప్పుడప్పుడు సహాయపడుతూ వాన్ని బాగా దగ్గరికి చేర్చుకొని, తన కూతుర్ని పెళ్లి చేసుకుంటే యూనివర్సిటీలో ఉద్యోగమిప్పిస్తానని ఆశ చూపాడు. ఆ ఆశ వెనక స్వార్థం వుండొచ్చుగానీ అది రంగస్వామికి గొప్ప వరమేనని నేను వాన్ని ప్రోత్సహించాను. ఆ తర్వాత పెళ్లి జరగడమూ ఉద్యోగం రావడమూ ఒకదాని తర్వాతవొకటి జరిగిపోయాయి.

ట్యూషన్ నుంచీ పిల్లలు సరాసరి మిద్దెమీది కొచ్చి 'డాడీ' అని పిలవడంతో గతస్మృతుల్లో నుండి బయటపడ్డాను. పిల్లలను పలకరిస్తూనే రంగస్వామిని గురించి నాగ రాజు అదోరకంగా ఎందుకు మాట్లాడాడో తెలుసుకోవాలనుకుంటూ పైకి లేచి పిల్లలతో కలిసి కిందికి వెళ్లాను.

** ** **

ఆదివారం వచ్చింది. ఫ్యామిలీతో కలిసిపోడానికి వీలుగాక నేనొక్కన్నే రంగస్వామి కోరినట్లు గృహప్రవేశానికి వెళ్లాను. శారదానగర్లో వాని ఇల్లు చూడగానే ఆశ్చర్యపోయాను. ఇల్లు బ్రహ్మాండంగా వుంది. గృహప్రవేశం భారీయెత్తున ఏర్పాటుచేశాడు. వైస్‌ఛాన్సలర్ దగ్గర్నుంచీ మొత్తం యూనివర్సిటీ ప్రొఫెసర్లూ, రీడర్లూ, లెక్చరర్లూ జిల్లా అధికారులూ, పురప్రముఖులూ దాదాపు మూడునాలుగు వందలమంది మూగారు. నలభైయాభై కార్లు పార్క్‌చేసి వున్నాయి. అదంతా ఆర్భాటమే అనిపించినా అది వాని సాంఘిక స్థాయినీ వాని పరపతినీ ఎత్తి చూపుతున్నట్లు కనిపించింది.

రంగస్వామి నన్నూ నాగరాజునూ సాదరంగా ఆహ్వా

నించి తన కొలీగ్స్‌ను పరిచయం చేశాడు. వైస్‌ఛాన్సలర్‌తో చేయి కలిపించాడు.

సూట్ వేసుకొని, హుందాగా అధికారులనూ వి.ఐ.పి.లనూ విష్ చేస్తూ పలకరిస్తున్న రంగస్వామిని చూడ్డానికి నాకయితే రెండు కళ్లూ చాలలేదు. ఒకనాటి చెప్పుల కొండన్న కొడుకు, పాచిపనులు చేసిన రంగమ్మ కడుపుపంట ఈరోజు జిల్లాలో ఒక ప్రముఖమయిన వాడయ్యాడు. రంగమ్మ చెమట ఎంత అద్భుతంగా పరిమళించింది! ఆ తల్లి కలలు ఎంత మధురంగా పండిపోయాయి!

నా హృదయం తృప్తిగా కాసేపు గాలిలో తేలిపోయింది. బఫే భోజనాలు మొదలయ్యాయి. మిత్రుడు చాలా ఖరీదయిన భోజనం ఏర్పాటుచేశాడు. భోజనం తింటూ, ఒకనాడు చింతతొక్కూ, తెల్లపాయ, కారమూ తప్ప పప్పుచారుకు ముఖం వాసిన రంగస్వామి ఈరోజు ఇన్నిరకాల పదార్థాలను గురించి ఎప్పుడు తెలుసుకున్నాడోనని ఆశ్చర్యపోతూ భోజనం గురించి పక్కనున్న వాళ్లు పొగడుతూ వుంటే మౌనంగా వింటున్నాను. నాగరాజు ప్లేటు పట్టుకొని నాదగ్గరికొచ్చి దోసకాయ ముక్కను మునిపళ్లతో కొరుకుతూ ఏదో గొణగసాగాడు. వాని వ్యవహారం చూసి నా మనసు చివుక్కుమనింది. ఇక భరించలేక, 'సాదరంగా ఆహ్వానించి వాడు ఇంత ఖరీదయిన భోజనం పెడితే నువ్వెందుకురా అంతగా బాధపడుతున్నావు? నీ పద్ధతేమీ నాకు నచ్చలేదురా' అని కొంచెం బాధను వ్యక్తంచేశాను.

'అవున్లేరా, నా వ్యవహారం నీకెందుకు నచ్చుతుంది? స్నేహితుడు పైకి ఎదిగిపోతూ వుంటే అసూయపడే వాణ్ణిగదా మరి?' నాగరాజు గొంతులో వేదన వ్యక్తమయింది.

'ఎందుకురా అట్ల మాట్లాడతావ్? ఏమి జరిగిందో చెప్పచ్చుగదా!' ప్రాధేయపూర్వకంగా అడిగాను.

'ఏమిజరిగిందో తెలియలేదేమిరా? ఈ గాడిదకొడుకు అసలయిన వాళ్లను ఎంత నెగ్లెట్ చేశాడో గమనించలేదా?' అంటూ రంగమ్మనూ ఆమె మరో ఇద్దరు పిల్లలనూ గుర్తుచేశాడు. నా గొంతులో మెతుకులు అడ్డం పడినట్లయ్యాయి.

నిజమే. నాకు అంతవరకూ గుర్తుకే రాలేదు. అక్కడ రంగమ్మగానీ ఆమె పిల్లలుగానీ కనిపించలేదు. లోపల గదుల్లో ఏమయినా వున్నారేమోనని నన్ను నేను సమాధానపరుచుకుంటూ భోజనం తింటూనే అటూఇటూ పారాడుతూ అంతా వెదికాం. రంగస్వామి జీవనజ్యోతులయిన ఆ ముగ్గురూ ఎక్కడా కనిపించలేదు. నేను తింటున్న పదార్థాలలో రుచులు మారిపోయాయి.


ఫంక్షన్ అంతటా రంగస్వామి మామగారు విశ్వరూపమెత్తినట్లు కనిపించసాగాడు. నాగరాజు అదేపనిగా ఆయన దగ్గరికెళ్లి అదొరకంగా పలకరిస్తూ ఇంటినీ ఆయననూ పొగిడాడు. నేనూ వాని మాటల్లో మాటలు కలిపాను. పూర్వశిష్యులంకదా, ఆయన పరవశించిపోతూ ఆ ఇంటిని వర్ణించడానికి పూనుకున్నాడు. ఖర్చు పన్నెండు లక్షలు దాటిందన్నాడు. అంత డబ్బు ఎక్కన్నుంచి వచ్చిందని మేమెక్కడ అడుగుతామోనని ఆయనే కల్పించుకొని, రెండేండ్ల కిందట తన అల్లుడు 'మానవత్వపు విలువలు- ఆర్థిక సంబంధాలు' అనే అంశం పైన ఒక విదేశీ పత్రికకు వ్యాసం రాశాడనీ ఆ వ్యాసం కారణంగా అమెరికాలోని అనేక విశ్వవిద్యాలయాలు 'గెస్ట్ లెక్చర్స్' ఇవ్వమని తన అల్లుణ్ణి ఆహ్వానించాయనీ అక్కడికెళ్లి వచ్చినందువల్ల ఇరవైఐదువేల డాలర్లు రావడంతోపాటు తన అల్లుని గొప్పతనాన్ని ప్రపంచ పత్రికలన్నీ శ్లాఘించాయనీ మురిసిపోతూ చెప్పాడు. ఆయన ఇంకా తన అల్లుని గుణగణాలను పేర్కొంటూ తాను ఎంత వద్దంటున్నా వినకుండా ఒక్కగానొక్క కూతు రున్న తన పేరు మీద ఈ ఇల్లు కట్టించాడనీ తనకు అటువంటి అల్లుడు దొరకడం తన అదృష్టమనీ పొంగిపోయాడు.

రంగస్వామి తన మామగారి పేరు మీద ఇల్లు కట్టించడంలోని కిటుకేమిటో ఆ తర్వాత నాగరాజు చెప్పాడు. అది విని నా తల తిరిగిపోయింది.

భోజనాలు ముగించుకొని నేనూ నాగరాజూ ఇళ్లకు బయలుదేరాం. పోతూపోతూ సడన్‌గా కలెక్టర్ ఆఫీసు దగ్గర స్కూటర్ ఆపి, ఒక పెంకుటిల్లు వైపు చేయి చూపుతూ, 'రంగమ్మ ఇల్లు అదేరా, వెళ్లి పలకరించిరా, నేను చెప్పడంకంటే ఎన్నో వాస్తవాలు నీకే తెలుస్తాయి' అని చెప్పి వెళ్లిపోయాడు నాగరాజు.

నేను రోడ్డు పక్కన స్కూటర్ నిలిపి, ఎదురుగా రోడ్డుకు అవతలి దిక్కున కనిపిస్తున్న పెంకుటిల్లు వైపు నడిచాను.

అదే ఇల్లు. ఇరవై సంవత్సరాల కిందట చూసిన పెంకుటిల్లు.



**ఇంటి పక్కనున్న వేపచెట్టు కింద గోనెసంచి మీద కాసిన్ని కాసిన్ని దోసవిత్తనాలూ బఠానీ గింజలూ గుండుపప్పులూ, ఉలవ పట్నాలూ మరొకపక్క కలమాగిన అరటిపండ్లూ, జామపండ్లూ పెట్టుకొని ముసురుతున్న ఈగల్ని పైటకొంగుతో తోలుతున్న రంగమ్మ... చింపిరిగా రేగిన జుట్టు సగభాగం నెరసివుంది. కంటిపాపలు ఎక్కడో గుంతల్లో కదలాడుతున్నాయి. పేదరికం ఆమె వొంటిమీదా ఇంటిముందూ తాండవమాడుతూ వుంది.**

ఇప్పుడా ఇంటికి అటూ ఇటూ వందలాది ఇళ్లు. అన్ని ఇళ్లున్నా ఎదుగూబొదుగూ లేనందువల్లనేమో, సులభంగానే ఆ ఇంటిని గుర్తించాను. ఇంటి పక్కనున్న వేపచెట్టు కింద గోనెసంచి మీద కాసిన్ని కాసిన్ని దోసవిత్తనాలూ బఠానీ గింజలూ గుండుపప్పులూ, ఉలవ పట్నాలూ మరొకవక్క కలమాగిన అరటిపండ్లూ, జామపండ్లూ పెట్టుకొని ముసురుతున్న ఈగల్ని పైటకొంగుతో తోలుతున్న రంగమ్మను పోల్చు కున్నాను.

చింపిరిగా రేగిన జుట్టు సగభాగం నెరసివుంది. కంటిపాపలు ఎక్కడో గుంతల్లో కదలాడుతున్నాయి. దౌడలు లోనికిపోయాయి. గొంతుకింద ముడతలేర్పడ్డాయి. తేపలేసి కుట్టుకున్న చీర అక్కడక్కడ 'పిగిలి' పోయి వుంది. కుడిచేతి 'రెట్టకింద' రవిక చినిగిపోయింది. మాసిపోయిన బట్టలమీద చెమటమరకలు మట్టలు మట్టలుగా కనిపిస్తున్నాయి. పేదరికం ఆమె వొంటిమీదా ఇంటిముందూ తాండవమాడుతూ వుంది.

కళ్లముందు కనిపిస్తున్న ఆ పచ్చి వాస్తవాన్ని నమ్మలేకపోయాను. నా శరీరమంతా కాసేపు అవమానంతో కుంగిపోయింది. నాగరాజు, రంగస్వామిని గురించి ఎందుకంతగా అసహ్యించుకుంటున్నాడో అర్థమయింది.

'ఎన్నో విశ్వవిద్యాలయాల్లో ప్రతిభావంతునిగా పేరు పొంది, ఈ పట్టణంలో మేధావిగా, సంపన్నునిగా గుర్తింపు పొందిన వ్యక్తిని కని, పెంచి పెద్దజేసిన తల్లేనా ఈ పేదరాలు? ఈ పేదరాలి రక్తం తాగి ఎదిగిన కొడుకేనా ఆ సంపన్న మేధావి?

ప్రశ్నలు మెదడులో ప్రకంపించాయి. తలలోని నరాలు చిట్లినట్లయ్యాయి. ఉద్వేగంతో పెదవులు ఎండుకుపోయాయి. కడుపులో నుంచీ పొంగి వస్తున్న వేదనను పెదవులతో నోట్లోనే అదుముకుంటూ బరువుగా నిట్టూరుస్తూ దగ్గరికి వెళ్లి, 'ఏమి రంగమ్మ పిన్నమ్మా, బాగుండావా?' అని పలకరించాను. రంగమ్మ నా వైపు యెగాదిగా చూస్తూ, "యెవుర్నాయినా నువ్వు" అని అడిగింది.

'నేను పిన్నమ్మా, సంజీవపురం బోయనాగప్ప కొడుకు శంకర్ని' అంటూ పరిచయం చేసుకున్నాను.

'అయ్యో పాపోడా, నువ్వా నాయిన్నా! యెన్నాల్లకు కనిపిత్తివి సామీ. యాడో యేరే దేశాల్లో వుండావంటనే, యెపుడొత్తివయ్యా' అని అడుగుతూ, 'వొసేయ్ సుంకీ, మీ అన్నయ్య జతగాడొచ్చినాడు, బిరిగ్గ రగ్గు తీసకరాయే పరసడానికి' అంటూ బిడ్డను కేకేసింది. పిలిచిందే తడవుగా సుంకమ్మ పాతరగ్గు తీసుకొని వచ్చి నా పక్క చూస్తూ పరచింది. గుర్తుకొచ్చానేమో, 'యెవురు మా, సెంకరప్పన్నయ్యా?' అని తల్లినడిగింది.

'వూఁనే, యెలివి మొగందానా, మల్ల యెవురనుకొంటివి?' అని బిడ్డను మందలించి, 'కూకోయ్యా, అందురూ బాగుండారా?' అని అడిగింది. నేను నా తల్లిదండ్రుల విషయం చెప్పి సుంకమ్మను పలకరించాను.

సుంకమ్మ ఎప్పుడో, చిన్నప్పుడు చూసిన పిల్ల. ఎంత గొప్ప మనిషైంది? కాలివేళ్లకు మెట్టెలున్నాయి. పెళ్లి అయినట్లుంది. చీర కట్టుకొని ఎంత నిండుగా వుంది?

*(మిగతా 39వ పేజీలో)*

అందుకవసరమైన లక్షణ గ్రంథాలను పుక్కిటపట్టారు. వారి ప్రేమకు పాత్రులయ్యారు.

శ్రీపాదకృష్ణమూర్తి శాస్త్రిగారి పరిచయం కూడా గంగాధరంకి తీపిగుర్తు. ఇటు పండిత సాంగత్యం. అటు పామర వాఙ్మయంతో అనుబంధం. ఈ అనుబంధాన్ని టేకుమళ్ళ అచ్యుతరావు, వారి కుమారుడు కామేశ్వరరావు పటిష్ఠం చేశారు. ఆనాడు పేరొందిన పత్రికలన్నీ గంగాధరం సేకరించిన వేలాది పాటలు తదితరాల్ని అచ్చేసినాయి.

జానపద విజ్ఞానం సేకరిస్తూ మద్రాసు వెళ్ళినప్పుడు సాహిత్య సుప్రసిద్ధులు మల్లంపల్లి సోమశేఖరశర్మ, వేటూరి ప్రభాకరశాస్త్రి, పురాణం సూర్యనారాయణ తీర్థులు, కాశీనాధుని నాగేశ్వరరావు పంతులు, టేకుమళ్ల రాజగోపాలరావు లాంటి పండిత కవులు, చరిత్ర పరిశోధకులతో పరిచయం కలిగింది. రాజగోపాలరావు పొడుపుకథలు, యుక్తిలెక్కలు, వాడుక కథలు సేకరించమన్నారు. గూడవల్లి, తాపీవారు వేమన పద్యాలను సేకరించమన్నారు. మదరాసు ఓరియంటల్ మానుస్క్రిప్ట్ లైబ్రరీలోని 35 తాళపత్ర గ్రంథాలనుండి వేమన పద్యాలు సేకరించారు. ప్రసిద్ధ చరిత్రకారులు మారేమండ రామారావు పేరంటాల చరిత్రలు సేకరించవలసిందిగా ప్రోత్సహించారు.

గిడుగురామమూర్తి పంతులుగారు మాత్రం శాస్త్రీయ రీతిలో సమాచారాన్ని ఎలా సేకరించాలో సూచించారు. వెరశి ఆయా పండితులు తాము క్షేత్రపర్యటన చేసి సేకరించలేని అంశాలను గంగాధరంగారికి అప్పచెప్పారు. వాటిని సేకరించి తన సత్తాచూపారు. క్షేత్ర పర్యటనలో ఉత్సాహంగా పల్లెటూళ్ళకి వెళ్ళి పనిపాట్లు చేసుకునేప్పుడు వాటిని విని యథాతథంగా రాసుకునేవారు. అలా రాసుకునేప్పుడు సామెతల్ని, నుడికారాల్ని, పదబంధాల్ని, మాండలిక పదాల్ని, జాతీయాల్ని కూడా రాసేవారు. మగవాళ్ళకి పంచెలు, స్త్రీలకు చీర రవికెలు కొని ఇచ్చేవారు. కొంత మంది కళాకారులకి కల్లు, సారాయి తాగితే తప్ప గొంతు పెగిలేది కాదు. తెలుగు నేలమీద నలువైపుల తిరిగితిరిగి ఒళ్ళు గుల్ల చేసుకున్న పరిశోధకుడీతను. ఇంటినీ, ఆస్తినీ హరింపచేసి తెలుగు సాహిత్య కుటీరంలో జానపద వెలుగులు గుమ్మరించారు.

నాలుగువేల జానపద గీతాలు, నాలుగువేల పైగా మాండలిక పదాలు, పదివేల పైగా సామెతలు, ఐదు వందల ముగ్గులు, ఐదువేలు వేమన పద్యాలు, మరెన్నో సేకరించారు. ఆ పట్టిక ఇవ్వడం కూడా కష్టమే!

తెలుగు ప్రాంతంలోని విశ్వవిద్యాలయాల్లో జరిగిన పరిశోధనలకు వీరిసేకరణ ఎంతగానో ఉపయోగపడింది. ప్రఖ్యాత పరిశోధకులందరూ ఆయన చిరు గృహమైన 'జానపద వాఙ్మయ కుటీర్'కి వచ్చి లబ్ధిపొందిన వారే.

భారతదేశమంతా పర్యటిస్తూ పంజాబ్ నుండి రాజమండ్రికి వచ్చి గంగాధరం కృషిని లోకానికి చాటారు దేవేంద్ర సత్యార్థిగారు. జనవరి, 1942లో 'మోడరన్ రెవ్యూ' పత్రికలో వీరి గురించి, వీరు సేకరించిన సాహిత్యం గురించి వరుస వ్యాసాలు వెలువడ్డాయి. ఆయనే తన పత్రిక 'మీట్‌మై పీపుల్'లో గంగాధరం చేసిన అసామాన్య కృషిగురించి లోకానికి తెలియచేశారు. ధరీ, గాతీహై, గాయేగా హిందుస్తాన్, ఆజ్‌కల్, యుగప్రభలాంటి ఎన్నో జాతీయస్థాయి పత్రికలు వీరిని గురించి రాశాయి.

ఐతే వీరిగురించి ఆ పత్రికలు రాయని కోణం ఒకటుంది. అదేమంటే తనచుట్టూ ఉన్న పండిత వర్గాన్ని సంతృప్తిపరిచేందుకు ఎన్నో గ్రంథాలు రాశారు. క్షేత్ర పర్యటన ఖర్చులకోసం వ్యాపార ప్రచురణకర్తల కోసం ప్రజాదరణ గ్రంథాలు కూడా రచించారు. కుటుంబానికి ఏమీ మిగల్చకుండా తాను తినకుండా పామర సాహిత్యం కోసం జీవితాన్ని అంకితంచేసిన ఏకైక తెలుగు పరిశోధకుడు గంగాధరం. అతనికి ఇంత తెగింపు ఎలా వచ్చింది.

**4**

తన కీర్తి ప్రతిష్టల కోసం ఎన్నడూ పరితపించని మనిషి. పల్లెపల్లెకూ, హరిజన వాడలకూ, గిరిజన తండాలకు సంచారం చేసిన దేశదిమ్మరి.

ఉంటే తిని లేదా పస్తులున్న సామాన్యుడు. తాను బతికినంత కాలం తనదికాని ఇంటి స్థలాన్ని అతని మరణం తరువాతే పురపాలక సంఘంవారు వారి కుటుంబానికి ఇవ్వాలని ప్రభుత్వానికి సిఫారసు చేశారు. వారు నడిపిన పాఠశాల స్థలంలో "నేదునూరి గంగాధరం జానపద వాఙ్మయాన్ని పరిరక్షించడానికి ఏర్పడిన సంస్థ ఈనాటికీ దైన్యావస్థలోనే ఉంది.

గంగాధరం నిజాయితీకి మారుపేరు. సహృదయులు. అతని మంచితనపు జ్ఞాపకాలు ఇంకా పదిలంగా ఉన్నాయి. ఈ జ్ఞాపకాల్ని ఛేదించి ఆయనపై ఒక మంచి జీవితచరిత్ర రావలసిఉంది. ఆ పని చేయగలిగిన సత్తా మిత్రులు సన్నిదానం నరసింహశర్మకుంది. అది నెరవేరితే గురుదక్షిణ ఇచ్చి రుణం తీర్చుకున్నవారు అవుతారు.

సన్నిదానం వారు ఆ రకంగా తెలుగువారందరికీ రుణపడి ఉన్నారు. విముక్తులు కావడం వారి చేతుల్లోనే ఉంది.

తెలుగునేలమీద గంగాధరం పాదాలుతాకినచోట-

ఆ నేలకింద లోతుల్లో దాగివున్న పామరజన సాహిత్యపు గనులు బయటపడ్డాయి.

కొందరు గ్రంథాలురాస్తే కొంతకాలమే గుర్తుంటాయి. వాటిని చూసినప్పుడు మాత్రమే రచయితలు గుర్తొస్తారు.

కాని తన పేరునే పామర జన సాహిత్య విజ్ఞానాల చిరునామాని చేసిన ఇంతటి పరిశోధకుడు మరొకరు లేరు. ■

## తులసివనంలో తుమ్మచెట్టు

(19వ పేజీ తరువాయి)

నుంకమ్మను పలకరిస్తూనే నాలో నేను మాట్లాడుకున్నాను. అంతలోనే లోపల్నుంచీ చీమిడి కార్చుకుంటూ 'ఉత్తబిత్త'లున్న వొక నాలుగేండ్ల పిల్ల, 'అమా, బూపెడుదులామ్మా' అంటూ వచ్చింది. రంగమ్మ ఆ పిల్లను వొడిలోకి తీసుకొని చీరకొంగుతో దాని చీమిడి తుడిచి, 'నా మనవరాలు నాయిన్నా. ఈ ముదనష్టంది పడతానే ఆ బేబర్సోడు నా బిడ్డకు అన్నాయం చేసి ఇంగొగదాన్ని లేపుకోని పోయినాడు. ఇంగ ఆ కొడుకంటావా, బేల్దారి పనికి పోతాపోతానే వొగ మొగున్నిడిసిన దాన్ని తగుల్కోని యేరే కాపరం పెట్నాడు' అంటూ బాధపడింది. అంత బాధలోనూ ఆమె ధైర్యంగానే కనిపించింది.

అదీయిదీ మాట్లాడుతూ నేనే రంగస్వామిని గురించి ప్రస్తావించాను. మానిపోయిన ఏగాయం పగిలిందో యేమో ఒక్కసారిగా ఆమె దుఃఖం కట్టలు తెంచుకుంది. ఫళఫళ కారుతున్న కన్నీళ్ల వెంట మాటలు ముద్దలుగా జారిపడుతున్నాయి.

ఆయప్ప సంపదను మేమేమయినా కోరుకుంటిమా నాయిన్నా? నాలుగిండ్లు కట్టుకుండాడంట! మాకేమన్నా వొగిటిమ్మని అడిగితిమా తంద్రీ? కన్నతల్లిని ఇంట్లో పెట్టుకోని సాకద్దులే, కొత్తింట్లేకి చేరి యెంతమందికో వొప్పన్నం పెట్నాడంట, ఈ తల్లిని ఇంటికి పిల్చి పిడికెడు బువ్వ పెట్టేకి మనుసు రాలేదాసామీ? కన్న వస్తులు పడి అంతటోన్ని చేసిన కన్నతల్లి నీడ పడతానే ఆయప్ప సిరి కరిగిపోతావుండెనా? ఆ ఇంటికి దిస్టి తగుల్తాండెనా? వొక్కగానొక్క తోడబుట్టువే, దీని చేతల్లేకి జానెడు రయికబట్ట పెట్టేకి శాతకాలేదా నాయిన్నా? ఆ యప్ప బువ్వా వొద్దు, బట్టా వొద్దులే, ఇద్దురు మనవండ్లు పుట్నారంట, కడాకు వాళ్లనన్నా కండ్లతో వొగసారి చూసేకి నోసుకోలేదా తంద్రీ?

ఉన్నట్టుండి రంగమ్మ నోరు పూడిపోయింది. దుఃఖం తెరలుతెరలుగా కమ్ముకుంది. ఆ కన్నతల్లి కడుపులో అగ్నిపర్వతాలు బద్దలయ్యాయేమో, కన్నీటి లావా పొంగుతూ, మానవుడు పెంచుకున్న అమానుష నాగరికతను కాల్చి బూడిదచేసే దానివలె పొగలు గక్కుతూ వుంది. మూగవోయిన ఆమె గొంతులో నుండీ వెలువడుతున్న శబ్దాలు రంగస్వామి చదువునూ ప్రతిభనూ ఉద్యోగాన్ని పరువునూ సంపదనూ నిలదీస్తున్నట్లున్నాయి.

మిత్రుని గురించి గర్వంతో పొంగిపోయిన నా హృదయం అగాధాల్లోకి కుంగిపోయింది. గ్రామీణ జీవితం నుండీ, అట్టడుగు వర్గాల నుండీ పైకి వచ్చిన మనిషిలో మానవత్వపు వాసన అంటుకొని వుంటుందనుకున్న నాలోని భ్రమలు వొక్కసారిగా ఆవిరయిపోయాయి.

మనిషిలో స్వార్థం పెరిగిపోయి వుండవచ్చు. అన్నిటినీ శాసించేవి ఆర్థిక సంబంధాలే కావచ్చు. కనిపెంచిన వాళ్లను తృణీకరించడం సాధారణమే అని అనుకోవచ్చు. వాళ్లను పోషించి తీరాలనే రూలు వుండకపోవచ్చు. కానీ మానవుడు ఆటవిక దశనుండీ నాగరికత వైపు పయనిస్తూ మంచి సమాజం కోసం ఎన్నో మతాలనూ దేవుళ్లనూ నీతులనూ ధర్మాలనూ కట్టుబాట్లనూ కల్పించుకున్నాడు. ఇవన్నీ మనిషి మనిషిగా బతకడం కోసమేకానీ జంతువుగా జీవించడంకోసం కాదుగదా!

చదువూ విజ్ఞానమూ సంపదా మతాలూ ధర్మాలూ నీతులూ గుళ్లూ గోపురాలూ అన్నీ మనిషిని క్రూర జంతువు దశ నుండీ మార్చలేనప్పుడు ఇక వాటివల్ల ప్రయోజనమేమిటి?

మాటలకందనంత వేదన నా వొంటినిండా పాకడంతో అక్కడ ఎక్కువసేపు నిల్చోలేకపోయాను. ఆ కన్నతల్లి ప్రశ్నలకు బదులివ్వలేక రెండు వోదార్పు మాటలు మాట్లాడి బరువుగా ఇల్లు చేరుకున్నాను.


చదవండి **మీ విజ్ఞాన తృష్ణకి సరైన వేదిక** చదివించండి

**మహర్షి కాలజ్ఞానమ్**
**వేదజ్యోతిష విజ్ఞాన మాసపత్రిక**
డా॥ ఆమంచి బాలసుధాకర శాస్త్రి సంపాదకత్వంలో
వేదము Vs సైన్సు - సమన్వయ వేదిక

**సం॥ర చందాదారులుకండి**
**ఉచితజాతకం, రుద్రాక్ష పొందండి**
సభ్యులను చేర్పించుటకు ఏజంట్స్‌ను ఆహ్వానిస్తున్నాము.

శ్రీమహర్షి పబ్లికేషన్స్

**శ్రీ మహర్షి రుద్రాక్ష & నవరత్న ఎంపోరియం**
నం.13, గాయత్రి టవర్స్, Opp : ఓల్డ్‌బస్‌స్టాండు ఎదురుగా, విజయవాడ - 0866-570199
బ్రాంచి : 6-3-354/10, హిందీనగర్, పంజాగుట్ట - హైదరాబాద్ 040-6636696